క్లుప్తంగా

మద్యం, సారా ధ్వంసం



ధ్వంసం చేస్తున్న మద్యం బాటిల్స్

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదేశాలమేరకు సోమవారం సీతానగరం సర్కిల్ పరిధిలో వివిధ సోదాల్లో పట్టుబడిన మద్యం సీసాలు, సారాను ధ్వంసం చేశామని సీఐ డి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతానగరం సర్కిల్ పరిధిలో 72 కేసులలో పట్టుబడిన 106.75 లీటర్ల మద్యం, 2 కేసుల్లో పట్టుబడిన 39.5 లీటర్ల సారాను ధ్వంసం చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదవులను ఆదుకోవాలి



పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు (ఫైల్)

సీతానగరం: మండలంలో ఇటీవల పిడుగు పాటుకు గుర్రై గొర్రెలను కోల్పోయిన యాదవ కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలని సీతారాంపురం గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల గాదెలవలస పరిధిలో ఉన్న సుభద్రదరి సీతారాంపురంలో వీచిన ఈదురుగాలి, పిడుగులతో 11 గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గొర్రెలు కోల్పోయిన యాదవకులస్తుడు పాల్లె నీలయ్య సోమవారం మాట్లాడుతూ గ్రామానికి చెందిన ముగ్గురు యాదవుల గొర్రెలు, మేకలు పొలాల్లోకి మేత నిమిత్తం తోలామని అప్పట్లో ఉరుములతో కూడిన పిడుగులు పడడం వల్ల ఇళ్లకు చేర్చే సమయంలో విపత్తు జరిగిందన్నారు. దీంతో ఆర్థికంగా నష్ట పోయామని, వృత్తి పనిలేకుండా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి గొర్రెలు, మేకలు కోల్పోయిన తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యం



మెయిన్‌రోడ్డు వద్ద వేస్తున్న యోగాసనాలు

సాలూరు: యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమని యోగా శిక్షకుడు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డు వద్ద యోగాసనాలు వేశా రు. ప్రత్యేక యోగాసనాలు వేసి వాటి ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా శిక్షకుడు మాట్లాడుతూ, మనిషి జీవనంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.యోగా ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, వైద్యాధికారి డా.శివకుమార్, యోగా సెంటర్ ప్రతినిధులు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగకు సహకరించాలి

ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం.రాంబాబు



పండుగ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం.రాంబాబు

పార్వతీపురం రూరల్: ఎర్రకంచమ్మ, ఇప్పలపోలమ్మ, బంగారమ్మ పార్వతీపురం గ్రామదేవతల పండగను జూన్ నెల 1,2,3 తేదీల్లో నిర్వహించనున్న సందర్భంగా ఆయా గ్రామ దేవతలకు సంబంధించిన ఉత్సవ కమిటీ సభ్యులతో పాలకొండ డీఎస్పీ, ఇన్‌చార్జ్ పార్వతీపురం డీఎస్పీ ఎం.రాంబాబు సోమవారం సమావేశం నిర్వహించారు. సిరిమాను ఊరేగింపు, బందోబస్తు ఏర్పాటు, నిఘా కెమెరాల ఏర్పాటు, పండగకు తరలివచ్చే భక్తులు, బంధువులు సంఖ్య అంచనా వంటి అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. పోలీసు శాఖ వారికి సహకరించి భక్తులు సురక్షితంగా పండుగను జరుపుకుని మొక్కులను తీర్చుకునే విధంగా ఏర్పాట్లకు సహకారం అందించాలని కోరారు. సిరిమాను వెళ్లే మార్గంలో విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో విద్యుత్ తీగల తొలగింపునకు సహకారం అందించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఉత్సవ కమిటీకి సహకారం అందించాలని సూచించారు.



అధ్వానంగా పరిసరాలు..

రోగాల బారిన ప్రజలు

- పట్టించుకోని అధికారులు

పార్వతీపురం రూరల్:

ఎక్కడికక్కడే చెత్త నిల్వలు పేరుకుపోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా తయారవుతున్నాయి. చెత్త నిల్వలు పేరుకుపోయిన ప్రాంతాలను పందులు, కుక్కలకు ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. ప్రస్తుతం వర్షాలు అడపాదడపా కురవడంతో చెత్త మురిగిపోయి మరింత దుర్గంధభరితంగా తయారైంది. దీంతో ప్రజలు ముక్కుమూసుకుని రాకపోకలు చేయాల్సి వస్తోంది. అలాగే పరిసరాల అపరిశుభ్రత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోజురోజుకు ఆస్పత్రుల్లో జ్వరాల బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. అయినప్పటికీ చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాల ప్రారంభంలో, శివారు ప్రాంతాల్లో చెత్తకుప్పలే స్వాగతం పలికే విధంగా రహదారికి ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలు ఉన్నప్పటికీ కనీస స్థాయిలో నిర్వహణ లేక వాటి వైపు చూసే నాథుడు కూడా కరువయ్యాడు. నిత్యం ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు నానా యాగీ చేస్తున్నారే తప్ప ఆచరణలో కానరావడం లేదు. నర్సిపురం, పుట్టూరు, ఎమ్మార్‌నగరం అలాగే పార్వతీపురం మున్సిపాల్టీలో గల పలు వార్డుల్లో చెత్తలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తూ సంబంధిత సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.



పార్వతీపురం పోస్టాఫీసు వీధిలో చెత్తలో వ్యర్థాలను చెల్లాచెదురు చేస్తున్న వీధి కుక్కలు



గంగాపురంలో నిరుపయోగంగా ఉన్న చెత్తసేకరణ కేంద్రం



ఎమ్మార్‌నగరం శివారులో రోడ్డుపక్కన ఏర్పడిన చెత్త డంపింగ్

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

పార్వతీపురంటౌన్: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం నాయకుడు జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రస్తుతం కుళాయిల ద్వారా మంచినీరు వారానికి రెండుసార్లు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆ ఇచ్చిన తాగునీరు కూడా బురదతో కలుషితమైనదని, ఆ నీరు తాగడానికి పనికి రావడం లేదన్నారు. కోట్లాది రూపాయలు ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న పార్వతీపురం మున్సిపల్ యంత్రాంగం కనీస తాగేందుకు మంచినీరు కూడా ఇచ్చే పరిస్థితి లేకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాశ్వత మంచినీటి పథకానికి రూ.80 కోట్లు కేటాయింపులు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, ఫలితంగా మళ్లీ కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అమ్మవారి పండగ సమీపిస్తున్న వేళ తక్షణమే చర్యలు చేపట్టి ప్రతిరోజూ పరిశుభ్రమైన తాగునీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంచాన ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

భూముల గట్లు పటిష్ఠం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాబ్జీ, బి. శ్రీరాములు నాయుడు

సీతానగరం: ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమైన మెట్టు భూముల గట్ల నిర్మాణం మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు మెట్టభూముల గట్లు అభివృద్ధికి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శ్రీరాములునాయుడు, సీడీసీ మాజీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, లచ్చయ్యపేట ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పశువులు, ట్రాక్టర్లు తిరుగాడడం, వరదల కారణంగా మెట్టు భూముల మడి గట్లు పూర్తి పాడయ్యాయన్నారు. రైతులు భూముల్లో సాగు చేయడానికి నీటి సమస్య ఉన్నందున మడుల చుట్టూ గట్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు.వ్యవసాయం చేయడానికి అనుకూలంగా ఉండేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా వేతనదారులకు పనులు కల్పిస్తూ మెట్టు భూముల అభివృద్ధికి ప్రభుత్వం చొరవతీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు నాయకులు ఆర్వీ పార్థసారథి, బక్కుపేట మాజీ సర్పంచ్ బక్కు సూర్యనారాయణ, బక్కు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీలో ఉన్న ఏడు సులభ్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కార్మికులకు నేటికి 18 నెలల జీతాలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు జి.గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీ పాలన పేరు గొప్ప, ఊరు దిబ్బలా ఉందని సులబ్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కూడా జీతాలు చెల్లించే పరిస్థితిలో అధికారులు లేరని విమర్శించారు. కార్మికులకు గత 18 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు? చిరుద్యోగులు, కార్మికుల విషయంలో ఇంతటి తీవ్ర నిర్లక్ష్యం మంచిది కాదని విమర్శించారు. కార్యక్రమంలో కార్మికులు బి సుధ, జోజమ్మ, ఎన్ హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు

ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి కల్పించండి



ఎంపీడీఓకు వినతి పత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ విజయ, వేతనదారులు

బలిజిపేట: మండలంలోని పణుకువలసలో 600మంది ఎస్సీ, ఎస్టీ, మరి కొందరు వేతనదారులకు ఉపాధి పని అడుగుతున్నా పని కల్పించడం లేదని సర్పంచ్ ఆర్.విజయ అన్నారు. ఈ మేరకు వేతనదారులకు ఉపాధి పని కల్పించాలని కోరుతూ ఆమె ఎంపీడీఓ నగేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వారికి పనిలేకపోవడంతో అలమటిస్తున్నారని, జీవనోపాధి లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉపాధి పనుల నిర్వహణకు ఫీల్డ్ అసిస్టెంట్ లేదని సుభద్ర ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జ్‌గా వేసినా పనికల్పించడం లేదన్నారు. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి గ్రామంలో అందరికీ ఉపాధిపని కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వేతనదారులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోశ్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: పీజీఆర్ఎస్ విభాగానికి ప్రజల నుంచి వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కె ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి ధర్మ చంద్రా రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

నగదు బదిలీకి ఆధార్ అనుంధానం కావాలి

- డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ రెడ్డి బాబు

పార్వతీపురం టౌన్: సంక్షేమ పథకాల నగదు బదిలీకి ఆధార్‌కు బ్యాంకు అకౌంట్‌ను అనుసంధానం చేయాలని పార్వతీపురం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ రెడ్డి బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌పీసీఐకి అనుంధానం చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంకు ఖాతాకు జమ చేసేందుకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్‌కు బ్యాంకు అకౌంట్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయడం ద్వారా సంక్షేమ పథక ఫలితాలు ఇబ్బంది లేకుండా అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆధార్ సీడింగ్ (ఎన్‌పీసీఐ మ్యాపింగ్) ఇంకా పూర్తిచేయని వారు వెంటనే తమ దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలకు సిద్ధంగా ఐపీపీబీ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభించాలి

సాలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు గ్రామస్థాయిలో సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు ఎనలేని సేవలు అందించిన ఆ కేంద్రాలు నేడు నిర్లక్ష్యాని గురవుతున్నాయి. సాలూరు మండలంలోని కొన్ని పంచాయతీల్లో పనులు పూర్తిచేసుకుని చివరిదశలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా కనీసం ఆ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఆ కోవలోనే మండలంలోని కరాసవలస రైతుభరోసా కేంద్రం పనులు పూర్తిచేసుకుని రైతులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రానికి మిగిలిన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం లేదు. రైతులకు అవసరమైన సేవలు అందించే రైతు భరోసా కేంద్రాలను వినియోగంలోకి తేవాలని పలుగ్రామాల రైతులు కోరుతున్నారు.



గత ప్రభుత్వంలో నిర్మాణం పూర్తయిన కరాసవలస రైతుభరోసా కేంద్రం

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

- ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చునని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని సంగంవలస, నర్సిపురం తదితర గ్రామాల్లో ప్రజలకు సైబర్ నేరాలు జరిగే తీరుపట్ల అవగాహన కల్పించారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ముద్ర రుణాలు, వర్క్ ఫ్రంహోం ఉద్యోగ అవకాశాలు అంటూ ఆశ చూపి ఎరవేసేందుకు సైబర్ నేరగాళ్లు పన్నాగాలు పన్నుతున్నట్లు ఆమె తెలిపారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి లేదా ఐడీలనుంచి సోషల్ మీడియాలో ఏదైనా లింక్ వస్తే వాటిని ఓపెన్ చేయకూడదని ఎస్సై హితవు పలికారు. అలాగే తమ వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను ఫోన్ ద్వారా గుర్తుతెలియని వారు ఎవరైనా అడిగితే తెలిపేందుకు నిరాకరించాలని స్పష్టం చేశారు.



సంగంవలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై బి.సంతోషి కుమారి

కాలువకోసం తవ్వి వదిలేశారు

- మురుగునీరు చేరి దోమలతో ఇబ్బందులు



గంగన్నదొర వలసలో కాలువల కోసం తవ్విన గోతిలో చేరిన మురుగునీరు

సాలూరు రూరల్: మండలంలోని గంగన్నదొరవలస గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువ నిర్మాణానికి మూడు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా ఆదరాబాదరాగా గోతులు తవ్వి వదిలేశాడు. ఇప్పుడు ఆ గోతుల్లో మురుగు నీరు చేరి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇలాగే కాలువ నిర్మాణం చేయకుండా ఉంటే రానున్నది వర్షాకాలం కావడంతో మరింత మురుగునీరు చేరి గ్రామస్తులు రోగాలబారిన పడే అవకాసం ఉంటుందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కాలువ నిర్మాణం చేపట్టాలని లేదంటే తీసిన గోతులు కప్పాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దోమలతో ఇబ్బందిగా ఉంది

కాలువలు నిర్మిస్తామని గోతులు తవ్వి ఇప్పుడు నిధులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ తప్పుకున్నాడు, ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఆ గోతుల్లో నీరు చేరి దోమలతో పాటు మురుగు కంపు కొడుతోంది. కాలువ నిర్మాణం చేయాలి. లేనిపక్షంలో గోతులైనా కప్పాలి.

ఆర్.మహేష్, గంగన్నదొరవలస గ్రామం



వ్యవసాయ నేలబావిలో జాగ్రత్తలు లేకుండా ఈతకొడుతున్న చిన్నారులు



గెడ్డలో స్నానం చేస్తూ ఇలా..

ఈతరం సరదాతో విషాదం

- తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాల్సిందే.

పార్వతీపురం రూరల్:

ప్రస్తుతం వేసవి సెలవుల్లో చిన్నారులు ఎక్కువగా ఆటలాడుకునేందుకు మొగ్గు చూపుతారు. తల్లిదండ్రులు వద్దని వారిస్తున్నా స్నేహితులతో కలిసి తెలిసీ తెలియని పసితనంతో ప్రమాదపుటంచున ఆటలు ఆడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేలబావులు, చెరువుల్లో ఈతకొడుతూ స్నానాలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఈ నేపథ్యంలో వాటి లోతు అంచనా తెలియక, ఈత వచ్చేవారిని అనుసరిస్తూ లోతుల్లోకి వెళ్లి ప్రాణాలు విడుస్తున్నారు. ఈత వచ్చేవారు కూడా ప్రవాహానికి ఎదురుగా ఈదడం , మెరికలను గమనించకుండా నీటిలోకి దూకడం, నీళ్లలో దాగుడు మూతల్లాంటివి ఆడటం ప్రమాదాలకు ఆస్కారమవుతున్నాయి. పోలీస్ శాఖ ప్రమాదపు హెచ్చరికలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు తల్లిదండ్రులే పిల్లలను ఎంతైనా ఓ కంట కనిబెడుతూ ఆడుకునేందుకు వెళ్తున్న వారి అడుగులను గమనించాలని నిపుణులు చెబుతున్నారు.



పులిగుమ్మిలో ప్రమాదవశాత్తు సాకిగెడ్డలో మృతిచెందిన స్నేహితులు (ఫైల్)

పెళ్లికి వచ్చి విషాదం

ఇటీవల పార్వతీపురం మండలంలోని పులిగుమ్మి గ్రామంలో వివాహ వేడుకకు ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతం నుంచి వచ్చిన ఐదుగురు స్నేహితులు పులిగుమ్మి గ్రామ శివారులో ఉన్న సాకిగెడ్డలో సరదాగా ఈతకొట్టేందుకు వెళ్లారు. వారిలో ఈతరాని ఇద్దరు స్నేహితులు గెడ్డలో ఇరుక్కుని ప్రాణాలు విడిచారు. గెడ్డలో ఏప్రాంతంలో ఎంత మేరకు లోతు ఉందో అంచనా వేయలేని పరిస్థితుల్లో ఈతకోసం వెళ్లిన వారు మృత్యువు బారిన పడ్డారు. సరదాగా పెళ్లిలో పాల్గొనేందుకు వచ్చి మృత్యువాత పడడంతో తల్లిదండ్రులతోపాటు, బంధువులకు తీరని విషాదం మిగిలింది.



సాకిగెడ్డవద్ద ప్రమాదపు హెచ్చరికను ఏర్పాటు చేసిన పోలీసులు

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు

పార్వతీపురం టౌన్:

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకుడు వై.మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు అత్యంత ముఖ్యమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర ద్రోహం చేసేందుకు కేంద్రంలోనీ ఎన్డీఏ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా స్టీల్ ప్లాంట్ నష్టాల్లోకి వెళ్లేలా చేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరక్షణకు ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు వంగల దాలినాయుడు, తోట జీవరత్నం, బొత్స మోహన్ రావు బీవీ రమణ, గొర్లి వెంకటరమణ, ఎం వెంకటరమణ, సంచాన ఉమామహేశ్వరరావు, రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, సాయి శ్రీనివాస్ టి.గౌరీశంకర్ పాల్గొన్నారు.